

మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు, లక్ష్మీపద్మావతిల తనయుడు, యువ పారిశ్రామికవేత్త శిద్ధా సుధీర్‌కుమార్, శృతి దంపతుల కుమార్తె ఆరాధ్య పుష్పాలంకరణ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, నాగసత్యలత దంపతులు హాజరయ్యారు.

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
మంగళవారం 4 ఫిబ్రవరి 2025 పేజీలు 8

# మనిషిని కుదిపేస్తున్న క్యాన్సర్ మహమ్మారి

**మారిన జీవనశైలితో విజృంభిస్తున్న క్యాన్సర్ వ్యాధి**
**తొలి దశలోనే గుర్తిస్తే మన చేతుల్లోనే మహమ్మారి అంతం**
**క్యాన్సర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి**
**ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.రమణారెడ్డి**
**నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం**
**నేడు ఒంగోలులో డిజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు**

ఒంగోలు, మేజర్‌న్యూస్: మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల వల్ల పురుషులు, మహిళలు అనే లింగభేధం లేకుండా ప్రస్తుతం చాలా మంది అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. క్యాన్సర్ ఎవరికి ఎప్పుడు, ఎందుకు, ఎలా వస్తుందో చెప్పలేం. క్యాన్సర్ శరీరంలోని ఏ భాగంలోనైనా రావొచ్చు. నోరు, ఛాతీ, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణశయ, కాలేయ క్యాన్సర్‌ల వంటి దాదాపు 100కు పైగా క్యాన్సర్ రకాలు ఉన్నాయి. అయితే గడిచిన 30 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 50 ఏళ్లలోపు వయస్సు గల వారిలో క్యాన్సర్ కేసులు ఏకంగా 79 శాతం పెరిగాయంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపిస్తుందో తెలుస్తుంది.

### క్యాన్సర్ రకాలు

**1. కార్సినోమా:** క్యాన్సర్లలో కార్సినోమాలు అత్యంత సాధారణ రకం. ఈ క్యాన్సర్ చర్మంలో లేదా శరీరం లోపలి అవయవాలని కప్పి ఉంచే కణజాలంలో ప్రారంభమవుతుంది. ఇందులో బేసల్ సెల్ కార్సినోమా,



స్క్వామస్ సెల్ కార్సినోమా, ట్రాన్సిషనల్ సెల్ కార్సినోమా అనే వివిధ ఉప రకాలు ఉంటాయి.

**2. సార్కోమా:** కనెక్టివ్ లేదా సపోర్టివ్ టిష్యూల్లో (ఎముక, మృదులాస్థి, కొవ్వు, కండరాలు లేదా రక్త నాళాలలో) ప్రారంభమయ్యే క్యాన్సర్‌ను సార్కోమా అంటారు. సార్కోమా క్యాన్సర్‌లో లియోమియో సార్కోమా, కపోసి సార్కోమా, ప్రాణాంతక ఫైబరస్ హిస్టియోసైటోమా, లిపోసార్కోమా, డెర్మాటోఫైబ్రోసా ర్కోమా ప్రాటుబెరాన్స్ అనే ఉప రకాలు ఉంటాయి.




**3. లుకేమియా:** ఇది తెల్ల రక్త కణాలలో ఏర్పడే క్యాన్సర్. ఇది ఎముక మజ్జలో (బోన్ మ్యారో) రక్త కణాలను తయారు చేసే కణజాలంలో వస్తుంది.

**4. లింఫోమా, మైలోమా:** ఈ క్యాన్సర్లు రోగనిరోధక వ్యవస్థ కణాల్లోప్రారంభమవుతాయి.

**5. మెదడు, వెన్నుపాము క్యాన్సర్లు:** ఇవి కేంద్ర నాడీ వ్యవస్థలో ఉత్పన్నమయ్యే క్యాన్సర్లు. చాలా క్యాన్సర్లలో 4 దశలు ఉంటాయి. అయితే శరీరంలో కణితి స్థానం, పరిమాణం బట్టి దశ-1, దశ-2,

మిగతా 3లో

# ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలి

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు - పథకాలు, రుణాలపై అవగాహన పెంచాలి**
**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం**

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఉపాధిహామీ పథకంలో లక్ష్యం మేరకు పనిదినాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆమె వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వ్యవసాయ పనుల వలన కూలీలు రావడం లేదంటూ ఉపాధి పని దినాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని చెప్పారు. ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్ వంటి వ్యవసాయ, అనుబంధ ఉపాధి పనులపై ఎంపిడివోలు, ఏపివోలు దృష్టి సారించాలని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టరు చెప్పారు. వచ్చే వారం గోకులం షెడ్డుల నిర్మాణ డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమ అవుతాయన్నారు. ఎంబుక్ వంటి పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. బీసీ కార్పొరేషన్ నుంచి రుణాల



కోసం ఏడో తేదీలోగా దరఖాస్తులను పెట్టుకునేలాగ అర్హులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. హౌసింగ్ పథకాల కింద జరుగుతున్న నిర్మాణాల్లో ప్రతి వారం పురోగతి కనిపించేలా చూడాలని చెప్పారు. హౌసింగ్ పిడి పి.శ్రీనివాస ప్రసాద్, డిపివో వెంకట నాయుడు, డ్వామా పిడి జోసఫ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డిఆర్‌డిఏ పిడి రవికుమార్, పరిశ్రమల జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

# బాధితులకు వేగవంత న్యాయం అందాలి

**సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులను ఛేదించాలి**
**మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**ఒంగోలు టూ టౌన్ స్టేషన్‌ను తనిఖీ చేసిన రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు చోటు చేసుకోకుండా పటిష్ట నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని గుంటూరు రేంజ్ ఐ.జి సర్వ శ్రేష్ట త్రిపాఠి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గుంటూరు రేంజ్ సోమవారం ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి రిసెప్షన్, లాక్ అప్ రూమ్, ప్రాపర్టీ/స్టోర్ రూమ్, రికార్డు రూమ్ లను పరిశీలించి ఎఫ్ఐఆర్ ఇండెక్స్, కేసు డైరీలను, రిజిస్టర్లు, పలు రికార్డులన్నీ పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతి అడిగి తెలుసుకున్నారు. విచారణ దశలో ఉన్న గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసులు, దీర్ఘకాలంగా కేసులు పెండింగ్‌లో ఉండుటకు గల కారణాలను సమీక్షించి, క్వాలిటీ ఆఫ్ ఇన్విస్టిగేషన్‌తో కేసుల్లో



విచారణ వేగవంతం చేయడానికి అధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసులను ఛేదించాలని, ఒక నిర్దిష్ట ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్ట్‌లో

మిగతా 3లో

# ప్రజల అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలి**
**'మీకోసం'లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఆర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించి 'మీ కోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 251 అర్జీలు వచ్చాయి. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల



సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ఆర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ, రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో బి.చినఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్ధసారధి, వరకుమార్, విజయ జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సోమవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదకపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర పార్లమెంటు సభ్యులు

## అన్నసత్రం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ముమ్మనేని



భట్టిప్రోలు,మేనేజర్‌న్యూస్: మహాశివరాత్రి సందర్భంగా గోవాడ పుణ్యక్షేత్రానికి విచ్చేస్తున్న అనేకమంది భక్తులకు భోజన వసతి కల్పిస్తున్న లీలా భవాని పద్మశాలీయ అన్న సత్రం నిర్వాహకుల కృషి ఎనలేనిదని రేపల్లె మాజీ శాసన సభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య అన్నారు. రాను న్న శివరాత్రి సందర్భంగా సత్రం కమిటీ అధ్యక్షులు మాచర్ల నాగరాజు అధ్యర్యంలో మాజీ శాసనసభ్యులు వెంకటసుబ్బయ్య చే అన్నసత్రం క్యాలెండర్ ను అవిష్క రించారు.ఈ కార్యక్రమం లో అత్తులూరి బాలకృష్ణ, వామనపల్లి కోటేశ్వరరావు,దీపాల శివప్రసాద్,జొన్నదుల మణి,ఓంకార్ ప్రసాద్,పి రామకృష్ణ,పులిమి డోలా శివకు మార్,జొన్నదుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## తిరునాళ్ళకు పూర్తి శాంతిభద్రతలు కల్పిస్తాం: ఎస్ఐ భార్గవ్



నగరం, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని ధూళిపూడి లో ఈ నెల 10-11 తేదీల్లో శ్రీ తాళ్ళమ్మ తల్లి వీరమ్మ పేరంటాళ్ళ తిరునాళ్ళ నిర్వహిస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ సిసి కెమెరాల పరిరక్షణలో పూర్తి శాంతిభద్రతలు కల్పిస్తామని స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ బండ్ల భార్గవ్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయ ఇఓ లక్ష్మీప్రసన్నను వివరాలడిగి తెలుసుకున్నారు. తిరునాళ్ళ ఏర్పాట్లు, సిడిమాను ఉత్సవాలతోపాటు అమ్మవార్ల ఊరేగింపులో తీసికోవాల్సిన చర్యలు వివరించారు. తిరునాళ్ళకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌పై గ్రామ పెద్దలతో భార్గవ్ చర్చించారు. కార్యక్రమంలో పోలీసు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో అక్షరాభ్యాసం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అక్షరాభ్యాసం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు వెంకటలక్ష్మి, రిహన, పర్వీన్, సువర్ణ, కమరున్నీసా, రేఖ, మంజు, రమాదేవి, అంజలి పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు

మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: మండలంలోని బోడపాడు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో చదువుల తల్లి సరస్వతి దేవి వసంత పంచమి వేడుకలు పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులతో ప్రత్యేకంగా సరస్వతి దేవి ప్రార్థనలను ఆలపించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతరావు, షఫీ, హనుమంతు, డీలర్ గంగిరెడ్డి రామకృష్ణారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ రంగనాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సాదుల శేఖర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలో వాహనాల పార్కింగ్‌తో అలాగే వాహనాల రాక పోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైఎస్ఆర్ సెంటర్ వద్ద నుంచి కాటి వీరన్న చెరువు అలుగు వరకు రోడ్డు మధ్యలో రోడ్డు పైనే వాహనాలు పార్కింగ్ చేయడం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుల్లలచెరువు ఆర్టీసీ బస్టాండ్ గ్రామం మధ్యలో ఉండటంతో గ్రామాల్లోకి ప్రవేశించే వాహనాలు వెళ్ళే వాహనాల రద్దీగా ఉంటుంది. ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యంగా మారింది. వైఎస్ఆర్ సెంటర్ వద్ద నుంచి చెన్నయ్య డాక్టర్ హాస్పటల్ వరకు ఇరువైపులా ఉన్న హోటల్స్ టిఫన్ బండ్లు, కూరగాయల బండ్లు,మందుల షాపులు, బట్టల షాపులు చికెన్ సెంటర్‌లు ఉండటంతో రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. మరోపక్క తోపుడు బండ్ల వర్తకులు వ్యాపారాలు సాగిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో ట్రాఫిక్ మరింత నరకప్రాయంగా మారింది. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించిన సమయంలో బండ్లు పక్కకు తీసేస్తు, మరలా పోలీసులు వెళ్లగానే యథాతదంగా పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బం దులు తప్పడం లేదు. సర్వీస్ రోడ్డులలో వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పాదచారులు కోరుతున్నారు. సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# మహిళలకు 33 శాతం నామినేటెడ్ పదవులివ్వాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో మూడో విడతగ భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల పంపకం లో మహిళల కు 33 శాతం కీలకమైన పదవులు కేటాయించాలని కాపు ఉద్యమ నేత వేల్పూరి శ్రీనివాసరావు సిఎం చంద్రబాబు నాయుడు కు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి లకు వ్రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. సోమవారం భట్టిప్రోలు విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాల నుండి,నేటి వరకూ మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని శ్రీనివాసరావు పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో మహిళలపట్ల చూపిన వివక్ష కారణంగా జగన్ ను మహిళలు రాజకీయ సమాధి చేశారని,మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం అన్ని పదవులలో తక్షణం 33 శాతం కేటాయించాల ని,మహిళా కమిషన్ ను ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ అవినీతి,అక్రమా లపై పోరాటాలు చేసిన వేలాదిమంది మహిళల మీద పెట్టిన తప్పుడు కేసులను రద్దుచేయాలని వేల్పూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.మహిళా పథకాలకు దేశంలో మొట్టమొదటి మహిళా ఉద్యమ నేత సావిత్రి బాయి పూలే,ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ గా పేరుగాంచిన డొక్కా సీతమ్మ పేర్లు పెట్టాలని శ్రీనివాసరావు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం




తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో గల కెజిబివి బాలికల పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ సియం కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి పాఠశాల స్థితిగతులపై రిపోర్ట్ తయారు చేయాలనీ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాలో 76 పాఠశాల తనిఖీ బృందం కలుజువ్వాలపాడు గ్రామంలో గల కేజీబివి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించి పాఠశాల హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం పాఠశాల తరగతి గదులను పాఠశాల మొత్తం విద్యార్థులు ఎంత మంది రికార్డ్‌ను తనిఖీ చేసారు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేరా అని పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేవా అని ప్రశాంత వంతమైన వాతావరణం ఉందా లేదా అనితనిఖీ చేసి విద్యార్థుల తల్లి తండ్రులకు సమావేశం నిర్వహించి సమస్యలను విద్యార్థుల భవిషత్‌పై చర్చించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ మాధురి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలకపాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమలా కాన్సెప్ట్ స్కూల్లో వసంత పంచమి



మార్కాపురం, మేజర్‌న్యూస్: స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్ నందు మాఘ శుద్ధ పంచమి, వసంత పంచమి వేడుకలు వేధ మంత్రొచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా కమలా విద్యా సంస్థల కరస్పాండంట్ పెనుగొండ పవన్ కుమార్ ముఖ్య అతిధిగా, పాఠశాల హెడమాస్టర్ మద్దికుంట్ల పెద్ద పుల్లయ్య ఆధ్వర్యంలో చదువుల తల్లి సరస్వతి దేవికి పూజ కార్యక్రమాలు ఘనం గా నిర్వహించడం జరిగింది. అనంతరం కార్యక్రమంలో భాగంగా పవన్ కుమార్ మాట్లాడుతూ అక్షర స్వీకార మహోత్సవం వలన చిన్నారులకు విద్యా బుద్ధులు, సత్ ప్రవర్తన, మంచి తెలివితేటలూ అలవరు తాయనీ తెలియజేశారు. అధిక సంఖ్యలో చిన్నారులు వారి తల్లిదండ్రులు హాజరై వేదమంత్రోచరణల మధ్య అక్షర స్వీకార మహోత్సవంను స్వీకరించారు. అనంతరం చిన్నారులకు పలక, బలపం అందించి, మిఠా యిలు పంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయి ని, ఉపాధ్యయులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

# నూతన ఏపీఓగా పల్లెపోగు మోషే బాధ్యతలు



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండల ఉపాధి హామీ పథకం నూతన ఏపీవోగా పల్లెపోగు మోషే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాచర్ల మండలంలో విధులు నిర్వహిస్తున్న మోషే సాధారణ బదిలీలలో భాగంగా పుల్లలచెరువుకి వచ్చినట్లు ఆయన తెలిపారు. ముందుగా జాయినింగ్ ఆర్డర్‌ను ఎంపీడీవో వసంతరావు నాయక్ ఇచ్చి అనంతరం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీకందరికీ కూడా నేను సుపరిచితుడేనని అన్నారు. విధులలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మనమందరం విధులలో అలసత్వం వహించకుండా చూసుకోవాలన్నారు. మండలంలో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలందరూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కూలీలకు ఏ సమస్య వచ్చినా వెనివెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పని విషయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పోలింగ్ బూత్ తనిఖీ చేసిన ఎస్ఐ భార్గవ్



నగరం, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన నగరం శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఏర్పాటు చేయతల పెట్టిన పోలింగ్ బూత్‌ను స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ బండ్ల భార్గవ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ నెలలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆయన కళాశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌ను పరిశీలించి, అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణను బూత్ నిర్వహణపై మరిన్ని వివరాలు అడిగి తెలిసికొన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తీసికోవాల్సిన ఇతర జాగ్రత్తలపై భార్గవ్ చర్చించారు.

## 5న ఫీజుపోరు నిరసను విజయవంతం చేయండి

**- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపు**



యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: వైఎస్ ఆర్సీపీ ఆధ్వర్య ంలో ఈ నెల5న నిర్వహించ తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీశ్రేణులకు యర్రగొం డపాలెం నియోజకవర్గం ఎంఎల్‌ఏ తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు నియోజకవర్గంలో చేపట్టబోతు న్నమని అందుకు సంబం ధించిన గోడ పత్రికను కూడ ప్రారంభిం చారు. ఈ సం దర్భగా ఫీజు పోరు కార్యక్రమాన్ని విజ యవంతం చేసేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిల్పునిచ్చారు.

## వేల గొంతులు - లక్ష డప్పులు పోస్టర్ ఆవిష్కరణ



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో చేపట్టనున్న వేల గొంతులు - లక్ష డప్పులు మహ ప్రదర్శన పోస్టర్‌ను సోమవారం పుల్లల చెరువులో ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆరేవులు ఇస్సాక మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఓబులు మాదిగ, ప్రసాద్ మాదిగ, ఆంజనేయులు మాదిగ, ఆమోస్ మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, అంకయ్య మాదిగ, గురవయ్య మాదిగ, లక్ష్మణ్ మాదిగ, భాస్కర్ మాదిగ, రవి మాదిగ, యేసురత్నం మాదిగ, సుబ్బయ్య మాదిగ, టైటాన్ మాదిగ, పాలయ్య మాదిగ, వెంకటేష్ మాదిగ తదితరాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మనిషిని కుదిపేస్తున్న క్యాన్సర్ మహమ్మారి

మొదటి పేజీ తరువాయి

దశ-3, దశ-4లుగా వర్గీకరించవచ్చు.

క్యాన్సర్ లక్షణాలు

1. అజీర్ణం లేదా గుండెల్లో మంట
2. రాత్రుల్లు ఎక్కువ చెమట పట్టడం
3. గొంతు, ముక్కు నుంచి రక్తం కారడం
4. దగ్గు మానకుండా రావడం
5. ఊపిరి ఆడకపోవడం
6. ఆకలి లేకపోవడం, అనుకోకుండా బరువు తగ్గడం
7. మింగడంలో ఇబ్బంది పడడం, రక్త వాంతులవ్వడం
8.మూత్రంలో రక్తం, మూత్రవిసర్జన సమయంలో ఇబ్బంది పడడం
9.శరీరంలో కొత్తగాకణితులు, పుట్టుమచ్చలు ఏర్పడడం
10.నోటి లోపల చిన్నగా తెలుపు లేదా ఎరుపు బొబ్బలు రావడం
11.రొమ్ములు, చనుమొనల్లో, చర్మంలో మార్పులు రావడం

క్యాన్సర్ చికిత్సలు

ఈ మధ్య కాలంలో క్యాన్సర్‌కు అధునాతన ట్రీట్మెంట్ విధానాలైన కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి ఉత్తమ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే సర్వైవల్ సక్సెస్ రేట్ అనేది ఆ క్యాన్సర్ రకం, తీవ్రతను బట్టి ఉంటుంది. అంతేకాకుండా జన్యు పరీక్షలు, రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, బయాప్సీలు వంటి క్యాన్సర్ పరీక్షలు చేయించు కోవడం ద్వారా క్యాన్సర్లను గుర్తించవచ్చు. అయితే క్యాన్సర్‌కు తొలిదశలోనే చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ మరణాల్లో దాదాపు సగానికి పైగా మరణాల రేట్లను తగ్గించవచ్చు.




ముఖ్యంగా ఆహారపు అలవాట్లను, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

**తొలి దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ అంతం చేయగలం**
**ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ ఎన్.రమణారెడ్డి**



మారిపోతున్న జీవన విధానంతో ఎక్కువ మంది క్యాన్సర్ వ్యాధిన పడుతున్నారని, క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే మహమ్మారి అంతం మన చేతుల్లోనే ఉంటుందని ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్య నిపుణులు డా. రమణారెడ్డి, డా. రఘునందన్ తెలిపారు. సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో జరుగుతాయి. అయితే, కొన్ని కార ణాల వల్ల, ఆ కణాలు నియంత్రణ కోల్పోయి, చాలా వేగంగా, అనియంత్రితంగా (నియంత్రణ లేకుండా) విభజన చెంది కణ సమూహాలుగా ఏర్పడే స్థితినే క్యాన్సర్ అంటారు. ఈ కణ సమూహాలను 'కణితి' (ట్యూమర్) అని పిలుస్తారు. క్యాన్సర్ కణాలు ముందుగా స్థానిక కణజాలం పైన దాడి చేసి వాటిని నాశనం చేయడమే కాకుండా మన శరీరంలోని రక్తం, శోషరస వ్యవస్థ ద్వారా ఇతర బాగాలకు కూడా వ్యాపిస్తాయి. ఇలా వ్యాపించే క్యాన్సర్నే మెటాస్టాటిక్ క్యాన్సర్ అంటారు. అయితే క్యాన్సర్ బారిన పడిన చాలా మందిలో నిరక్షరాస్యత, క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

**నేడు ఒంగోలులో డిజేఆర్ ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరం**

డిజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్ సౌజన్యంతో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలులోని టిడిపి ఒంగోలు కార్యాలయం పక్కన పిఎజి కల్యాణ మండలంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు వారి సౌజన్యంతో అవసరమైనవారికి రూ 5 వేలు విలువగల క్యాన్సర్ స్క్రీనింగ్ (పాప్ స్మియర్ పిఎస్ఏ, సిఏ125) పరీక్షలు ఉచితంగా చేయబడును. చైతన్య కార్డియాక్ సెంటర్ వారి సౌజన్యంతో బిపి, షుగర్, ఈసిజి, ఈసివో పరీక్షలు చేయబడును. స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శుక్లం ఆపరేషన్లు ఉచితంగా చేయబడును. అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇవ్వనున్నారు. ఒంగోలు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డిజేఆర్ ట్రస్ట్ నిర్వాహకులు దామచర్ల నాగసత్యలత, వారి కుమార్తెలు కోరారు.

## బాధితులకు వేగవంత న్యాయం అందాలి

మొదటి పేజీ తరువాయి



ఛార్జ్‌షీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం చేసేలా కృషి చెయ్యాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో పటిష్ట బీట్ సిస్టంను ఏర్పాటు చేయాలని, అసాంఘిక/చట్టవ్యతిరేక కార్యకలాపాలు ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటిని అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ డ్రంక్, డ్రైవ్ టెస్టులు చేపట్టాలని, తీర ప్రాంతాల్లో పటిష్ట గస్తీ ఉంచాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అరికట్టాలని, పాత నేరస్థులు రిపీటెడ్ అఫెండర్స్ పై నిఘా ఉంచాలని, పెట్టి కేసులను నమోదు చేయాలని, రోడ్డు సేఫ్టీ నియమాలు, సైబర్ నేరాలు, చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా ధైర్యాన్నిచ్చేలా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించి నప్పుడు ఎలాంటి నేరాలు జరగకుండా, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందించడం జరుగుతుందని ఐజి తెలిపారు. గుంటూరు రేంజ్ ఐజి వెంట అడిషనల్ (ఎస్పీ అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు తాలూకా సీఐ అజయ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ సిఐ సుబ్బారావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

## ఫీజు పోరును విజయవంతం చేయండి

కందుకూరు రూరల్, మేజర్‌న్యూస్: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేది బుధవారం ఉదయం 10 గంటలకు నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నిర్వహించనున్న "ఫీజు పోరు"కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ రోజు స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఫీజు పోరుకు సంబందించిన వాల్ పోస్టర్ ను వైసీపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు

## 108 కలశాలతో మహిళల ఊరేగింపు



చీమకుర్తి, మేజర్‌న్యూస్: చీమకుర్తి మెయిన్‌రోడ్‌లో వేంచేసి యున్న శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామి వారి తిరుణాల సందర్భంగా సోమవారం ఉదయం 108 కలశాలతో మహిళలు ఊరేగింపుగా గాంధీనగర్ శ్రీకోదండ రామస్వామి దేవాలయం నుండి భావనా ఋుషిస్వామి దేవాలయం వద్దకు చేరుకొని బద్రావతి సమేత భావనా ఋషి స్వామి వార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం వేదపండితులచే నిర్వహించారు. తదుపరి విఘ్నేశ్వరుని పూజ, మండపారాధన, కలశ స్థాపన, పులి పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ గౌరవసలహాదారులు తాటికొండ వెంకట సుబ్బారావు, అధ్యక్షులు దొంతు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జట్ల మురళీధర్, కోశాధికారి వాసి వెంకటేశ్వర్లు, పద్మశాలీల పెద్దలు బండి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దొంతు సోమయ్య, ఉపకోశాధికారి బండి రామకృష్ణ, చింత క్రింది అశోక్ కుమార్, కడవా రామ కృష్ణ, పుత్తూరు ఆంజనేయులు, నూకల రాఘవ, చింతగింజల శ్రీనివాసరావు, నూకల నాగలక్ష్మి,పర్వతం రాజ్యలక్ష్మి మరియు కమిటీ సభ్యులు, మార్కండేయ సంఘం వారు మహిళలు కుల బాంధవులు పాల్గొన్నారు.

## సామాజికవేత్త జ్యోతియ్య మృతి పట్ల మంత్రి గొట్టిపాటి సంతాపం



అద్దంకి మేజర్‌న్యూస్: పట్టణ ప్రముఖ సామాజికవేత్త, విశ్రాంత సైనికుడు పంతంగి జ్యోతియ్య మృతి పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రగాఢ సంతాపం తెలిపారు. సామాజిక కార్యక్రమాలకు దిక్సూచిగా నిలిచి, నేత్రదానం చేస్తే మరో జన్మ ఉండదనే మూఢ నమ్మకంతో ఉన్న వాళ్ళని నేత్రదానం చేయండి.. మరో ఇద్దరికి చూపునివ్వండి అంటూ ప్రజలను ఎంతగానో చైతన్యవంతులను చేసిన సేవా ప్రస్థానం జ్యోతియ్య సొంతమని అన్నారు. పాతవస్తువులు, బట్టలు సేకరించి అవి లేని నిరుపేదలకు పంచుతూ, ఎవరి ఇంట నైనా కార్యక్రమాలలో మిగిలిన ఆహార పదార్థాలు సేకరించి వాటిని నిరుపేదలకు అందించి ఆయన మానవత్వం చాటుకుని ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మంచి మనిషి జ్యోతియ్య అని పేర్కొన్నారు.

## 5న జిల్లాస్థాయి సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సీనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక జరగ నున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.వి.రమణారెడ్డి, ఏ.సుందరరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకొని ఉదయం 10 గంటలకు రావాలని కోరారు. ఎంపికైన సీనియర్ మహిళల జట్టు ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలకు వచ్చేవారు 1-1-1996 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు పూర్తి వివరాలకు జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిరుమలశెట్టి రవికుమార్ 96660 67764ను సంప్రదించాలని కోరారు.

## వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యవసరాలు వితరణ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని పిఆర్ కాలనీలో ఉన్నటువంటి సంజీవని అనాధ వృద్ధాశ్రమం, సంజీవని ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థకు గిద్దలూరు బంధల దొడ్డి బజార్ వాస్తవ్యులు గుర్రాల అమ్మణి ప్రథమవర్ధంతి జ్ఞాపకార్థం సందర్భంగా మేనల్లుడు గుర్రాల మల్లికార్జునరావు సంజీవిని ఫౌండేషన్‌లో 50 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరిగినది. 1000 లీటర్ల సింటెక్స్ బహూకరించడం జరిగినది. గుర్రాలు మల్లికార్జునరావు మాట్లాడుతూ సంజీవిని ఫౌండేషన్‌కి మా సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనప వెంకటేశ్వర్‌రావు, సాయికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



జరుగుమల్లి, మేజర్ న్యూస్: మండల పరిధిలోని నర్సింగోలు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత రామలింగ రూప శనీశ్వర ఆలయంలో సోమ వారం వసంత పంచమి సంద ర్భంగా అర్చకులు రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి విద్యాబుద్ధులు కలగాలని ఆశీర్వదించారు.

## 14న జరిగే వైయస్సార్‌సీపీ ఫీజు పోరును విజయవంతం చేయాలి



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: వై ఎస్ ఆర్ సి పి ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్‌సీపి విద్యార్థి విభాగం ఏలూరు సంజీవరెడ్డి కోరారు. ఫీజు పోరు పోస్టర్లు నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కొనకన మిట్ల ఎంపీపీ మురళి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు మోరా శంకర్ రెడ్డి, నాయకులు ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వర రెడ్డి, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ బాల వర్ధన్ తదితరులు నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

## శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదాయం రూ.1,32,809లు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం 1,32,809 రూపాయిలు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈ సందర్భంగా పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.47,600లు, లడ్డుప్రసాదాలు అమ్మకం ద్వారా రూ.22,480లు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.23,596లు, దేవస్థానం మహాప్రాకారం నిర్మాణానికి రూ.30,001లు, ఇతర విరాళాలు రూ.9,132లు వచ్చినట్లు ఇఓ తెలిపారు. మహాప్రాకారం నిర్మాణానికి కైపూర్ వాస్తవ్యులు అట్లా భీమరాజు, ఉషారాణి దంపతులు రూ.30,001లు ధర్మకర్త కె.చినఆదినా రాయణ సమక్షంలో అందజేసినట్లు ఇఓ నరసింహబాబు తెలిపారు.

# కలెక్టర్, ఎస్పీలను కలిసిన ట్రైనీ డీఎస్పీ రావూరి అభిషేక్




బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో ప్రాక్టికల్ శిక్షణ పొందే నిమిత్తం కేటాయించబడిన 2023వ బ్యాచ్‌కు చెందిన ట్రైనీ డి.ఎస్.పి రావూరి అభిషేక్ సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ని, పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క లను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకిత భావంతో విధులు నిర్వహించి, విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచించారు. పశ్చిమ గోదావరికి చెందిన ట్రైనీ డిఎస్పి అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొంది ప్రస్తుతం జిల్లాలో 6 నెలల పాటు ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు.

# చిత్తడి నేలలు జీవవైవిధ్య కేంద్రాలు

కొమరోలు, మేజర్‌న్యూస్: చిత్తడి నేలలు జీవ వైవిధ్య కేంద్రాలని ప్రపంచ చిత్తడి నేలలు దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్జిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తడినేలలు అత్యంత ప్రాముఖ్యత కలవని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది అని తెలియజేశారు. అలాగే ఈ చిత్తడి నేలలు జీవవైవిధ్య కేంద్రాలుగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయని అందుకే ప్రపంచంలో ఫిబ్రవరి రెండో తేదీని చిత్తడి నేలలు దినోత్సవంగా జరుపుకుంటారని, అందులో భాగంగానే నేడు మన చిత్తడి నేలలు జీవవైవిధ్య కేంద్రాలని వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం కోసం విద్యార్థుల ద్వారా పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే ఈ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన



వ్యాసరచన క్విజ్, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అశ్విని కుమార్, సీనియర్ ఉపాధ్యాయిని నిర్మల కుమారి, ఏపీ ఎన్జీసీ కోఆర్డినేటర్ విశ్వరూపం, ఉపాధ్యాయులు ఎస్‌కె రహ్మద్, నిర్మల్ కుమార్, శ్రీనివాస ప్రసాద్, మస్తాన్, రమేష్ బాబు, మహాదేవి, విజయనిర్మల, మహేందర్ రెడ్డి, అనిల్ బాబు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గన్‌మెన్ నాగరాజును అభినందించిన కలెక్టర్

బాపట్ల మేజర్ న్యూస్: జిల్లా పోలీస్ గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్ లో అథ్లెటిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి గన్మెన్ నాగరాజు ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభినందించారు. గన్ మెన్ నాగరాజు 4 బంగారు పతకాలు ఒక సిల్వర్ పతకాన్ని,1500 మీటర్



800 మీటర్, 4x100 మీటర్, 4x400 లెటర్, 400 మీటర్ సిల్వర్ మెడల్స్ ను గెలుపొందారు.

# సరస్వతీదేవికి పూజలు

ఉలవపాడు, మేజర్‌న్యూస్: స్థానిక సాయి పాఠశాలలో మాఘమాసం తొలి పండుగ వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతి దేవికి సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసము చేయించుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె.వి.శేషమ్మ మాట్లాడుతూ సరస్వతి దేవి ఆశీస్సులు ఉన్న వారి జీవితాల్లో అజ్ఞానం అనే చీకటి తొలగిపోయి జ్ఞానం అనే వెలుగులు నింపాలని, విద్యార్థులందరికీ ఆ సరస్వతి దేవి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో



పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.మౌనిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 5వ రోజు కొనసాగిన శ్రీ సిద్ధిగణపతి స్వామి బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండలం వెల్లటూరు లోని శ్రీ సిద్ధి,బుద్ధి సమేత గణపతి స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం 5రోజు ఉదయం గణపతి హోమం, మహాపూర్ణాహు తి,మహా నైవేద్యము,హారతి,మంత్రపుష్పం, తీర్థప్రసాదాలు, కుడుములు,ఉండ్రాళ్ళు ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హోమ గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.తాడికొండ వంశీ యుల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు కవుతా రాజేష్ శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు.రాత్రి 9 గంటలకు స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం రాత్రి జరిగిన స్వామి వారి కళ్యాణం లో తాడికొండ దత్త



దేవ హర్ష ప్రియాంక దంప తులు పూజలు నిర్వహించారు.ఆలయ అర్చ కులు కౌత రాజేష్, దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరా మచంద్రమూర్తి లు స్వామి వారి కళ్యాణకథలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలను దేవాలయం వంశిక ధర్మకర్త లు తాడికొండ ప్రసన్నకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

# పట్టభద్రుల స్థానం గెలిపించుకుందాం: ఎమ్మెల్యే

బాపట్ల, మేజర్‌న్యూస్: కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థి అలపాటిని గెలిపించుకుందాం అన్నారు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ. ఉమ్మడి గుంటూరు - కృష్ణ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సోమవారం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసికట్టుగా పని చేసి,కూటమి అభ్యర్థి




ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి షటిల్, బాట్మింటన్ విన్నర్స్‌కు అభినందనలు

వేటపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి పాలిటెక్నిక్ విద్యార్థుల షటిల్, బాట్మింటన్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీలలో విన్నర్స్ అయినట్టు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. డిఎ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ ఒంగోలులో ఇటీవల జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2024 (ఐ.పి.యస్.జి.యమ్-24) సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ పోటీలలో షటిల్, బాట్మింటన్ జట్టు జిల్లా స్థాయి పోటీలలో గెలిచి విశాఖ పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పోటిపడి విన్నర్స్ గెలుపొందినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డా.కె.జగదీష్ బాబు తెలిపారు. 2వ సంవత్సరం డిప్లమా ఇ.సి.ఇ విభాగంలో



చదువుతున్న కావటి రిషి, ఇ.ఇ.ఇ విభాగంలో చదువుతున్న ముక్కల సూర్య కిరణ్ జట్టు ఈ పోటీలలో పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల డిప్యూటి డైరక్టర్ (పాలిటెక్నిక్) డా.కె.విజయభాస్కర రెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి.రమణ మూర్తి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థిని విద్యార్థులు షటిల్ బాట్మెంటన్ జట్టుకు అభినందనలు తెలియజేశారు.

# శిరోజాలు ఊడిన క్యాన్సర్ రోగులకు జుట్టు దానం

చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల పిట్ట కొంచెం కూత ఘనమని విజ్ఞాన భారతి పాఠశాల సిబ్బంది అన్నారు. ఎంత చదివినా సమాజాన్ని చదవాలని పదిమందికి సహాయ పడుతూ జీవించాలని ఉన్నతంగా ఆలోచించిన చీరాలకు చెందిన ఒంటరి భవిష్యను అందరూ అభినందిస్తున్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శిరోజాలు ఊడిన క్యాన్సర్ రోగులకు ఒంటరి భవిష్య 14 అంగుళాల జుట్టును అందించింది. ఈ సందర్భంగా ఒంటరి భవిష్య మాట్లాడుతూ మహిళలకు జుట్టు అందమని మనిషి తన ప్రమేయం లేకుండానే క్యాన్సర్ రోగం బారిన పడుతారని మొదటి దశలో గుర్తిస్తే చికిత్స




ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. క్యాన్సర్ వలన శిరోజాలు ఊడిపోయిన మహిళలకు చికిత్స నిమిత్తం హెయిర్ అందించాలని తాను అనుకొన్నానని ఐదేళ్లుగా జుట్టు పెంచి ఇప్పుడు పంపిస్తున్నానని అన్నారు. జుట్టు లేకపోతే మహిళలు ఆత్మన్యూనత భావానికి లోనవుతారని తన వంతు సహకారం అందించాలని క్యాన్సర్ హెయిర్ డొనేషన్ సెంటర్ హైదారాబాద్ కు పంపించమని తెలిపారు. విజ్ఞాన భారతి స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న భవిష్య ఇంత ఉన్నతంగా ఆలోచించి సహాయం చేయడంతో తోటి విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

# బిసి, ఇబిసి, కాపు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, కాపు సామాజిక వర్గాల యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ఋణాలు మంజూరుకు అర్హత కలిగినవారు దరఖాస్తులు కంప్యూటరీకరణ నమోదు చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక మండల టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ బిసి, ఇబిసి, కాపు సామాజిక వర్గాలకు సంబంధిత కార్పొరేషన్లు బ్యాంకుల సమన్వయంగా 50శాతం సబ్సిడీపై ఋణాలు మంజూరు చేస్తారని ఈనెల 7వతేది వరకు మాత్రమే దరఖాస్తులు కంప్యూటరీకరణ చేసుకోవాలని మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో వివిధ వర్గాలకు యూనిట్లు మంజూరు చేసినట్లు మండల పరిషత్ అధికారులు సంబంధిత బ్యాంకుల సమన్వయంతో ఋణాలు మంజూరు చేస్తారని గ్రామ



సచివాలయాలు మీసేవ కేంద్రాల్లో కావలసిన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని నమోదు చేయించుకోవాలని అదేవిధంగా శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మండలానికి వివిధ కార్పొరేషన్లకు సంబంధించి మండలంలోని యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికంగా యూనిట్లు మంజూరు చేయించారని అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు అధికారులను సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మనబోయిన వెంగయ్య, యన్.సి.మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, కొనంగి వెంకటకొండయ్య తదితరులు ఉన్నారు.



## పొద్దెక్కినా తొలగని మంచు తెరలు

నగరం, మేజర్‌న్యూస్: బారెడు పొద్దెక్కినా మంచుతెరలు తొలగక సూర్యుడు కూడా బిక్కు బిక్కుమంటూ ఉదయిస్తున్న దృశ్యం సోమవారం ఈ ప్రాంతంలో చోటుచేసుకుంది. గత వారం రోజులు గా తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటలు కావస్తున్నా విపరీతమైన మంచు తెరలు దర్శనమిస్తుండటంతో రోడ్లన్నీ మంచుతో దుప్పటి కప్పినట్లుండటం, వాహన చోదకులకు ప్రయాణం కష్టతరమైంది.

# కొత్త మార్కెట్‌లో యధావిధిగా చిరు వ్యాపారాలను కొనసాగించాలి

## 'మీకోసం'లో కలెక్టర్ అన్సారియాకు వినతి



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు దామోదర్ సంజీవయ్య కొత్త కూరగాయల మార్కెట్‌లో రోజు వారి ఆకు కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులను యధా విధంగా కొనసాగాలని సోమ వారం కూరగాయల చిరు వ్యాపా రులు మీకోసంలో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ కమీ షనర్‌ని పిలిపించి వీరి సమస్యను పరిష్కరించాలని కోరారు. తరత రాలుగా మా జీవనాధారంగా ఉన్న ఈ వ్యాపారాన్ని రద్దు చేస్తే వీధుల పాలవుతామని హక్కుల ప్రకారం మాకు ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా వీధులు పాలు చేయడం సరైనది కాదని కలెక్టర్‌కి విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఏర్పాట్లు చేయమని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కొత్తపట్నం ఎంపిటీసీ ఆర్ వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, స్వీట్ వెండర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నగర సిపిఐ సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, భాస్కరు, తిరుపతమ్మ, గురవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జీవనమూర్తిస్వామి ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల



రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని అనుమలపల్లె గ్రామంలో జీవనమూర్తి స్వామి వారి ఆలయ ముఖ ద్వార ప్రారంభోత్సవ వేడుకలు స్థానిక మాజీ సర్పంచ్ భూపని కాశయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై, రిబ్బన్‌కట్ చేసి ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి వచ్చిన వేలాది మంది ప్రజలకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, పార్లమెంట్ నాయకులు గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, కుప్పా రంగ సాయి, స్థానిక నాయకులు సిరిగిరి వెంకటపతి, మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని గౌతవరం గ్రామంలో పోలేరమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ రాబోయే తరాలకు దేశ ఆచార వ్యవహారాలు తెలియచేసి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో జనసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ బెల్లంకొండ సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగనంద్, పార్లమెంట్ నాయకులు గోపిరెడ్డి జీవన్ రెడ్డి, కుప్పా రంగసాయి, ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో వసంత పంచమి పూజోత్సవం



కందుకూరు, మేజర్ న్యూస్: కందుకూరు పట్టణంలోని పామూరు రోడ్ నందు ఉన్న బి ఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా సోమవారం సరస్వతిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ జి.బాల భాస్కరరావు విద్యార్థుల సమక్షంలో సరస్వతీదేవి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు ,కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్రబాబు, స్కూల్ డీన్, ప్రిన్సిపాల్స్ తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పూజ అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికి అమ్మవారి వద్ద పూజించిన పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్ ను అందజేశారు.

# పదిలో మంచి ఫలితాలు సాధించాలి: ఎంఈఓ



పొదిలి, మేజర్‌న్యూస్ : పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసులు తెలిపారు. వసంత పంచమి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంద ర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. పబ్లిక్ పరీక్షలు రాసేవారు చక్కటి లిపితో జవాబులు రాయాలన్నారు. రోజు కనీసం 14 గంటల పాటు కష్టపడి చదవాలని సూచించారు. పదవ తరగతి అనేది మీ 10 సంవత్సరాల విద్యకు గుర్తింపు పొందే సందర్భమన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఉన్నత చదువులు చదవాలన్న, ఎటువంటి ఉద్యోగ అవకాశాలు రావాలన్నా, ప్రాథమికంగా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి పట్టుదలతో చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పరీక్షల సంబంధించిన సూచన సలహాలు ఇచ్చారు. అనంతరం పొదిలి పూర్వపు మాజీ సమితి అధ్యక్షులు కీర్తిశేషులు మొల్లల రామిరెడ్డి కుమారుడు ఎన్నారై మొలల శ్రీనివాస్ రెడ్డి స్పాన్సర్ చేసిన అల్పాహారాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం ఏవో 2నాగలక్ష్మి, హెచ్‌ఎం కరీమున్ బీబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో నేడు ఆదిత్య హోమం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళ వారం ఉదయం 9 గంటలకు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదిత్య హోమం నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్చిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవి రామకృష్ణారావు తెలిపారు. శ్రీవారికి సూర్యప్రభ వాహన సేవ జరుగుతుం దని పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# 4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 4న మంగళవారం ఉదయం 10 గంటలకు సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో డి.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈసమావేశంలో పలు రంగాల అభ్యున్నతపై సమీక్షించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ సమావేశానికి అందరూ పాల్గొని దీనిని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

# నాకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి

## 'మీకోసం'లో కలెక్టర్‌కు బడ్డపల్లి గ్రామ నివాసి ఏడుకొండలు వినతి



ఒంగోలు, మేజర్‌న్యూస్: మా గ్రామంలో కొందరి వలన నాకు, నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది, నాకు రక్షణ కల్పించాలని తర్లుపాడు మండలంలోని కేతగుడిపి పంచాయితీ బడ్డపల్లి గ్రామ నివాసి తమ్మిశెట్టి ఏడుకొండలు ప్రకాశం భవనంలోని మీకోసంలో అర్జీ ఇచ్చారు. వినతి రూపంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాకు వివరించారు. కొన్ని నెలల క్రితం మా గ్రామంలో జరుగుతున్న భూ ఆక్రమణ గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అర్జీ రూపంలో ఆయన దృష్టికి తీసుకెళ్లా. సిఎం ఆదేశాలతో మార్కాపురం సబ్‌కలెక్టర్ ఆక్రమిత భూములను తనిఖీలు చేసి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించి, భూములు చుట్టు ఉన్న గోడలను తొలగించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఆక్రమించిన భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీన పరుచుకోవడంతో ఆగ్రహించిన భూకబ్జాదారులు నాపై, నాకుటుంబంపై కక్ష కట్టి గొడవులకు పాల్పడుతున్నారు. నేను లేని సమయంలో మా కుటుంబంపై దాడులకు తెగబడుతున్నారు. నాకు, నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపిఎన్జీవో పొదిలి తాలూకా యూనిట్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



పొదిలి, మేజర్ న్యూస్: ఏపీ ఎన్జీవో పొదిలితాలూకా యూనిట్ నూతన సంవత్సరక్యాలెండర్ ను సోమవారం మండల తాసిల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో పొదిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంధాని భాష,కోశాధికారి వెంకట్రావు, ఉపాధ్యక్షులు కరిముల్లా,అబ్దుల్ ఆరిఫ్, సిహెచ్ వెంకటేశ్వర్లు,విజయ, సహాయ కార్యదర్శులు కళ ప్రపూర్ణ తనుజ, జయ వెంకటేశ్వర్లు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసిల్దార్ అవార్డు పొందిన తహసీల్దార్ కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు.

## బగళాముఖి ఆలయంలో అక్షరాభ్యాసములు



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్ : ప్రసిద్ధిగాంచిన చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో శ్రీ పంచమి సందర్భంగా బాల బాలికలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు ఎంతో వైభవముగా నిర్వహించారు.శ్యామలనవరాత్రు లలో 5వ రోజు సోమవారం వచ్చేటువంటి శ్రీ పంచమీ రోజు అక్షరాభ్యాసాలు చేయడం చాలా విశేషం అని పండితులను చెప్తుంటారు. ఈ కార్యక్రమానికి తమ తమ చిరంజీవులను తీసుకొని అనేక ప్రాంతాల నుండి వచ్చిన చిన్నారుల పేరు మీద సరస్వతీ పూజ జరిపించి పూజా కంకణాలు, పలకా,బలపములు, బిస్కెట్లు, స్వీట్లు దేవస్థానం తరపున పంపిణీ చేయడమైనదని ఆలయ ఇవో జి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

## వెంకటరత్నంను సన్మానించిన గౌడ యూత్ సభ్యులు



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: మండలంలోని గూడవల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకటరత్నం కర్లపాలెం పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ ఉన్నారు. ఆయన సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పోలీస్ అవార్డు ను ఇచ్చారు. సోమవారం గూడవల్లి గ్రామానికి చెందిన గౌడ యూత్ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ ఉపాధ్యక్షులు వీరికి వెంకట శివ, మాజీ సర్పంచ్ వీరంకి సాంబశివరావు, ఉప సర్పంచ్ పాగోలు కోటేశ్వరరావు, వీరంకి బుల్లియ, రాయన కృష్ణారావు, వీరంకి రామకోటేశ్వరరావు, రాయిన వెంకట శివ, రాయిన చంద్ర మౌళి, రాయన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనవాణి గ్రీవెన్స్‌లో పాల్గొన్న నామన



బాపట్ల, మేజర్‌న్యూస్: మంగళగిరి, జనసేన పార్టీ ముఖ్య కార్యాలయం నందు జనవాణి గ్రీవెన్స్ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు తోపాటు అర్జీలు స్వీకరించారు బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యురాలు కత్తి నాగలక్ష్మి, జనసేన రూరల్ పార్టీ అధ్యక్షులు ఏసుబాబు, ఆరుమళ్ళ సుజిత్, సిగిరిశెట్టి సంజయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల గురించి వివరించాలి



కర్లపాలెం, మేజర్‌న్యూస్: పంచాయతీ అధికారులు సమయపాలన పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ అందే విధంగా చూడాలని ఎంపీడీఓ అద్దురి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, గణప వరం, కేసవపురి కాలనీలోని సచివాలయాలు, పాఠశాల లు, అంగన్వాడీ సెంటర్ లను ఎంపీడీఓ అద్దురి శ్రీనివా సరావు సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. సకాలంలో సర్వేలు పూర్తి చేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.సచివాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# బెక్టగాన్ 2025 పోస్టర్ ఆవిష్కరణ



బాపట్ల, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ లో ఉత్తమ సాంకేతిక విద్యా కేంద్రంగా అందరి మన్ననలను అందుకుటున్న బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీల్లో జరిగే బెక్టాగన్ -2025 పోస్టర్ ను సోమవారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు ఆవిష్కరించారు. బెక్టాగన్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో టెక్నికల్, కల్చరల్,లిటరరీ, స్పోర్ట్స్ ఈవెంట్స్ కు సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించి మార్చి 1వ తేదీన విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లలను, 5 లక్షలకు పైగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మార్చి 1వ తేది సాయంత్రం అందరినీ అలరించే ప్రత్యేక సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ బెక్టాగన్ పై వారి సందేశం ఇచ్చారు.ఈ బెక్టాగన్-2025 కు కో-కన్వీనర్లు గా డా. కె.రాజేంద్ర, వి. మల్లికార్జునరావు వ్యవహరించనున్నారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులను కాపాడితే పారితోషకంతో గౌరవిస్తాం



చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల కళ్ళ ముందు జరిగిన ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను వెంటనే వైద్యశాలకు చేర్చిన వ్యక్తులకు ప్రభుత్వం తరపున పారితోషికం అందుతుందని ఆర్టీవో రామకృష్ణారెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం చీరాల ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన సమావేశంలో ఆర్టీవో మాట్లాడారు. వాహన చోదకులు, బాటసారులు ఇలా ఎవరైనా తమ ఉన్నచోట ప్రమాదం జరిగితే నిర్ణీత సమయంలో గాయపడిన వారిని వైద్యశాలకు చేర్చి ప్రాణాలు కాపాడాలన్నారు. అదేవిధంగా వైద్య సిబ్బంది కూడా అలర్ట్‌గా ఉండి సకాలంలో వైద్యం అందించడం ద్వారా చాలా ప్రాణా లు నిలబడతాయని చెప్పారు. వైద్యాధికారులు నరేంద్ర, సుభాషిణి, రాజాసాల్మన్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# 'లోకోస్' ప్రొఫైల్‌పై విఓఏలకు శిక్షణ



అద్దంకి, మేజర్‌న్యూస్: స్థానిక వెలుగు కార్యాలయం నందు "లోకోస్" ప్రొఫైల్ పై అద్దంకి, కొరిశపాడు, సంతమగులూరు మండలాల వి ఓ ఏ లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్పి అనూరాధ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పొదుపు సంఘాల సమాచారం మొత్తం ఒకే యాప్ కిందకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు .ప్రజల చేత నిర్వహించే యాప్ 'లోకోస్' అని తెలిపారు. పొదుపు మహిళ ల వివరాలు, రుణాలు, కంతులు చెల్లింపులు, పథకాల వివరాలు వంటివి యాప్ లో నిక్షిప్తం అవుతాయని చెప్పారు. రుణాలు పొందాలన్నా, తిరిగి కుతుల సమాచారం తెలుసుకోవాలన్నా 'లోకోస్' ద్వారా అందరికీ సమాచారం తెలిసే వీలుకలుగుతుందన్నారు. స్వయం సహాయ సంఘాల నిర్వహణలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నట్లు ఏపీఎం సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. సీఆర్పీలు ఈశ్వరి, మస్తాన్, బ్యాంక్ లింకేజి డీసీఎం ఆచారి,"భీమా ఎపీఎం: థామస్, స్త్రీనిధి మేనేజరు శంకర్,ఆయా మండలాల ఏపిఎంలు, పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ పార్క్



అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి -వేలామూరిపాడు రోడ్డులో పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ పార్క్ లో 35 రకాల పూలు, పండ్ల మొక్కలు సోమవారం నాటారు.రిటైర్డ్ ఎస్బిఐ మేనేజర్ రొటేరియన్ కొల్లిపర నాగయ్య ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు రోటరీ చేస్తున్న సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమానంతరం దాత కొల్లిపర నాగయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, కొల్లి సురేంద్ర, మన్నం త్రిమూర్తులు, కొమ్మాలపాటి సుధీర్, అలహరి హరి బాబు, కొల్లా భువనేశ్వరి, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, ఊటుకూరు రామకోటేశ్వరావు, దొడ్డపనేని భాస్కరరావు, రామ్మోహన్ రావు, రాఘవయ్య, ఆంజనేయులు, కొప్పోలు హనుమంతరావు, సుధాకరరెడ్డి, రాచమల్లు శివ, కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు రోటరీ వారు చేస్తున్న సేవలను కొనియాడారు కార్యక్రమానంతరం దాత కొల్లిపర నాగయ్యను సన్మానించారు.

## ఆదర్శ పాఠశాలలతోనే విద్యాభివృద్ధి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఆదర్శ పాఠశాలలతో విద్యాభివృద్ధి చెంది బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండల విద్యాశాఖ అధికారులు జె.ప్రసాదరావు, ఆర్.కొండారెడ్డి అన్నారు.సోమవారం ప్రధానోపాధ్యాయులు, పియంసి కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓలు మాట్లాడుతూ కేవలం కొన్నితరగతులను విలీనం చేస్తున్నట్లు పాఠశాలలు మూతపడే ప్రసక్తి లేదని అదేవిధంగా పాఠశాల యాజమాన్య కమిటీలు ఉపాధ్యాయులు సమన్వయంగా పనిచేసి అందరి సహకారంత వీలైనంత ఎక్కువ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసుకుని విద్యాభివృద్ధికి కృషిచేద్దామని ప్రాథమిక విద్యలో మంచిఫలితాలు సాధించడానికి ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదరున్నిసా బేగం, యం.కుమారి, యన్.తిరపతయ్య, హనుమంతరావు, పియంసి కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం స్వాధీనం

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తమ్మలూరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పి.డి.ఎస్ బియ్యంను ఎస్ఐ వై.నాగరాజు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో తరలిస్తున్న 70 బస్తాలు పి.యాడ్.ఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. వినుకొండకు చెందిన మర్రిపూడి బసవయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంను ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.



## విద్యా చైతన్యపీఠం వార్షిక వేడుకలు



కర్లపాలెం, మేజర్ న్యూస్.శ్రీవిద్యా చైతన్య పీఠంలో 18 వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహి ంచినట్లు నిర్వాహకులు మామిడాల భార్గవి తెలిపారు. కర్లపాలెం మండలం నల్లమోతువారి పాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ విద్యా చైతన్య పీఠం 18 వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా లలితా త్రిపురసుందరి చంద్రమౌళేశ్వరస్వామి కల్యాణ మహోన్నత వేడుకలు నిర్వహించారు. తొలుత మండపారాధ న,లలితాదేవి, లక్ష్మీ,సరస్వతి దేవి,ఆదిశేషుడు, మానసాదేవి కి అభిషేకాలు,కుభేర పశుపతి హెూమం నిర్వహించారు. వేద పండితులు బి.వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో మాడా శ్రీనివాసరావు శివపార్వతి, దొడ్డా వెంకట రామారావు ఇందిరాదేవి, స్వామిరెడ్డి రాజ్యలక్ష్మి దంపతులు హెూమం కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు అనంతరం భక్తులకు అన్నప్రసాదంను అందించారు.

## అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలో పశు వైద్య రంగంలో అరుదైన శాస్త్ర చికిత్స చేసిన పిట్టలవానిపాలెం మండల పశు వైద్యాధికారి డాక్టర్ కిరణ్. జి ఎన్ పాలెం కు చెందిన రైతు పందర బోయిన ఏడుకొండలు దగ్గర ఉన్న 3 సంపడ్డ నడవడానికి ఇబ్బంది పడు తున్న నేపథ్యంలో మంద గుడి ఆపరే షన్ ను విజయవంతంగా చేసి చక్కగా నడిచేలా శాస్త్ర చికిత్స అందించి పడ్డకు బాధ నుండి విముక్తి కలిగించారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడడం ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఏపీ సి ఎన్ పి మాస్టర్ ట్రైనర్ జి.శ్రీకాంత్ అన్నారు. కర్లపాలెం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆర్ వై ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించారు. కూరగాయలతో పాటు చిరుదాన్యలు అయిన సాములు,కొర్రలు,అంటు కొర్రలు, అరికెలు,ఊదలు మొదలగునవి అమ్మకాలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో బుద్దాం యూనిట్ ఇంచార్జి ఎం.సత్యనారాయణ, శామ్యూల్, నందిని,తిరుపతమ్మ, భులక్ష్మి, రవి శంకర్ రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు



## ఎస్పీ దామోదర్‌ను కలసిన బీజేపీ నాయకులు

రాచర్ల, మేజర్‌న్యూస్: జిల్లా పర్యటనలో భాగంగా ఎస్పీ దామోదర్‌ను రాచర్ల పోలీస్ స్టేషన్‌లో గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల సమస్యలను చర్చించడం జరిగింది. వాటిలో శాంతి భద్రతల విషయంలో మండల ముఖ్య ప్రదేశాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని వాటి ఏర్పాటుకు భారతీయ జనతా పార్టీ నాయకులకు ఎస్పీ దామోదర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టేమల్ల పుల్లయ్య, పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, వెంకటేష్ పాల్గొనడం జరిగింది. మండలంలో సిసి కెమెరాలను ఏర్పాటుకు సహకరించాలని ఎస్పి కోరగా భారతీయ జనతా పార్టీ తరుపున ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు.

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి ఆధ్వర్యంలో పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడం జరిగినది. ఈ స్టడీ మెటీరియల్స్‌ను పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు బి.భారతి, చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ ఉపాధ్యాయులు చేతులమీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకొని పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కొమరోలు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం స్థానిక తాసిల్దార్ డి.భాగ్యలక్ష్మి గ్రామ సచివాలయ వార్డు ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరించడం జరిగింది. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను ఎప్పటికప్పుడు విధిగా నిర్వహిస్తూ తమ హక్కులను ప్రభుత్వం ద్వారా తీర్చుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి అజయ్, వైస్ ప్రెసిడెంట్లు మంద ప్రవీణ్ కుమార్, జమాల్ బాషా, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు దేవనాయక్, రంగా, గ్రేట్ సిక్స్ కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్, వీఆర్వోలు రమణారావు, పాండు, రమణ, హనీషా, సర్వేయర్లు సోమశేఖర్, సుభాని, మనీషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరిస్తాం: ఎస్పీ



కొమరోలు, మేజర్‌న్యూస్: సిబ్బంది కొరత ట్రాఫిక్ సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని ఎస్పి ఏ.ఆర్.దామోదర సోమవారం కొమరోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాల క్రితం నిర్మాణమైన పోలీస్‌స్టేషన్‌ను రిన్నోవేషన్ చేయించి సుందరంగా తీర్చిదిద్దిన పోలీస్ స్టేషన్లను ఎస్పి ఏఆర్ దామోదర ప్రారంభించారు. అనంతరం కొమరోలు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను క్వార్టర్స్‌ను అణువణువునా పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను చేపట్టాల్సిన పనులను సిబ్బందికి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతి వాటికోసం చేపట్టిన చర్యలను గురించి అడిగి తెలుసుకొని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా కొమరోలు పోలీస్ స్టేషన్లో సందర్శించడం జరిగిందని, కొమరోలు పోలీస్ స్టేషన్లో రీన్నో వేషన్ కొరకు స్థానిక ఎస్డిపిఓ నాగరాజు, సీఐ రామకోటయ్యల సూచనలతో ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది, స్థానికుల సహకారంతో స్టేషన్లో మౌలిక వసతులు అలాగే మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు బేషుగ్గా ఉన్నాయని సిబ్బందిని అభినందించారు. త్వరలోనే ఎస్సై, సిబ్బంది కొరతను తీర్చే దానికి ప్రయత్నిస్తానని, అలాగే స్థానికంగా స్టేషన్ పరిధిలో ఉన్న ట్రాఫిక్, ఇతరత్రా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐ రాఘవేంద్ర, స్థానిక ఇన్చార్జి ఎస్ఐ కోటేశ్వరరావు, గిద్దలూరు, బేస్తవారిపేట ఎస్సైలు, స్థానిక స్టేషన్‌ఇంచార్జ్ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పుగుండూరు కాకతీయ సేవా సమితి నూతన కమిటీ ఎంపిక



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మండలం లోని ఉప్పుగుండూరులో కాకతీయ సేవాసమితి నూతన కమిటి ఆసంఘం జిల్లా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి సేవాసమితి ఆధ్యర్యంలో చేపట్టే కార్యక్రమాలు పేదవిద్యార్దులకు చేయూత తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఉప్పు గుండూరు కాకతీయ సేవాసమితి నూతనకమిటి అధ్యక్షులుగా కనగాల రామకృష్ణ, ప్రదానకార్యదర్శిగా నల్లూరి వెంకట మోహనరావు, కోశాధికారిగా కోట రమేష్, ఉపాదక్షులుగా బెల్లం మురళీ, సహాయకార్యదర్శులుగా నల్లూరి భాస్కరరావు, బెల్లం శేషయ్య, బెల్లం రాఘవయ్యలతో పాటు మరో 20మందిని కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు. అద్వజరీ కమిటి సభ్యులుగా బెల్లం సీతారామయ్య, నార్నె నాగభూషణం, కొల్లా శ్రీనివాసరావు (కెఎస్ఆర్) గోగినేని నాగేశ్వరరావు, నన్నపనేని కోటేశ్వరరావు, ఉన్నం వెంకట్రావులను ఏకగ్రీవంగా వ్యవహరిస్తారని తెలిపారు.

# రేపు భాష్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



చీమకుర్తి, మేజర్‌న్యూస్: స్థానిక రచ్చుమిట్ట సెంటర్లోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు 5వ తేది బుధవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు హ్యాపీ డెంటల్ హాస్పిటల్, మోడరన్ కంటి హాస్పిటల్ సునిశిత పర్యవేక్షణలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

ఈ మెగా వైద్య శిబిరం భాష్యం ప్రకాశం జోనల్ ఇన్ ఛార్జ్ కృష్ణ గణేష్ అధ్యక్షతన, బ్రాంచ్ ప్రిన్సిపాల్ జయకృష్ణ మరియు బ్రాంచ్ ఫాలో అప్ ఇన్ ఛార్జ్ ఆజాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ప్రోత్సాహకరంగా ఉంటాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయకృష్ణ కోరారు.





# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండేపి, మేజర్‌న్యూస్: ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో సోమవారం ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం మండలంలోని పెరిదేపి గ్రామం సమీపంలో పొలం పనులు నిమిత్తం ఎద్దులను తోలుకొని వెళుతున్న వ్యక్తిని వెనక నుండి వస్తున్నటువంటి మిట్టపాలెం గ్రామానికి చెందిన దర్శసి శివ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఎద్దులను తోలుకొని వెళుతున్నటువంటి వ్యక్తికి కాలు విరగగా ఢీ కొట్టిన వ్యక్తి ధర్శసి శివాకి కంటి వద్ద గాయం కావడంతో వీరి ఇరువురిని వైద్యం నిమిత్తం కొండేపి ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు.

## పీఎం జన ఔషధీ షాపును ప్రారంభించిన ఎస్ఐ రవీంద్రారెడ్డి



బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రంను బేస్తవారిపేట పోలీస్ స్టేషన్ రోడ్డులో సోమవారం గోపురమణారెడ్డి భారతీయ జనతా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన పీఎం జన్ ఔషధీ జనరిక్ మెడికల్ స్టోర్‌ను ఎస్సై రవీంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశమంతటా వేలాది కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఈ పీఎం జన్ ఔషది కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యతమైన మందులు తక్కువ ధరలకు అందించాలని లక్ష్యంతో తీసుకొచ్చిన పీఎం జనరిక్ షాపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిశ్చితార్ధ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని శ్రీ వినాయకస్వామి వారి ఆలయంలో గిద్దలూరు మండలం, బుర్జుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని 'సూరె మహేష్' నిశ్చితార్ధకార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా వసంత పంచమి



పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా వసంత పంచమి కార్యక్రమం నిర్వహించారు.ఎంఈఓ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం, స్టాఫ్ అందరూ కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టెన్త్ క్లాస్ విద్యార్థులు ఎగ్జామ్స్ అండ్ మంచి మార్కులు రావాలని సరస్వతి దేవి అనుగ్రహం పిల్లల మీద ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమ ఖర్చు నిమిత్తం మల్లల రామిరెడ్డి కుమారుడు మండల మొల్లల శ్రీనివాస రెడ్డి సహాయం చేసారు.

## ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన తేలప్రోలు రమేష్



సంతమాగులూరు మేజర్‌న్యూస్: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో బాపట్ల పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి తేలప్రోలు రమేష్ బాబు కుందుర్రు మామిళ్ళపల్లి పరిటాల వారి పాలెం గ్రామాలకు చెందిన నలుగురు వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను కుందుర్రు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు ఈ కార్యక్రమంలో కొప్పక కొండలు మోటుపల్లి వాసు తేలప్రోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

**బాపట్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విజయవంతం**

**విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్, బహుమతులు అందజేసిన ఎస్పీ తుషార్‌డూడి**

**క్రికెట్, వాలీబాల్ విభాగంలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచిన ఎస్పీ**

**పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టు**







బాపట్ల, మేజర్‌న్యూస్: అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణలో సైతం కొనసాగించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి అన్నారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఫిబ్రవరి 2న ఆదివారం రాత్రి జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మూడురోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ ఆదివారంతో ముగిశాయి. క్రీడాపోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వహించిన అన్ని క్రీడాపోటీలు కూడా అత్యంత ఉత్కంఠ భరితంగా సాగాయి. అనంతరం మూడు పోలీస్ సబ్ డివిజన్ల, హోంగార్డ్స్ విభాగం, డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ నుండి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్టులకు, వ్యక్తిగత విజేతలను జిల్లా ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్, బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ మెమొంటోలను అందజేసి అభినందించారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో ఓవర్‌ఆల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా ఏఆర్‌పిసి - 2236 జి.కృష్ణ నిలిచారు. మహిళల విభాగంలో ఓవర్ ఆల్ విజేతగా డబ్ల్యూపిసి - 179 జి.సునీత నిలిచారు. వాలీబాల్ విజేతగా డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్, రన్నర్ అప్ చీరాల సబ్



డివిజన్ జట్టు నిలిచాయి. కబడ్డీ విజేతగా బాపట్ల డివిజన్, రన్నర్ అప్ చీరాల సబ్ డివిజన్ జట్టు నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ విజేతగా చీరాల సబ్ డివిజన్ రన్నర్ అప్ డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ జట్టులు నిలిచాయి. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, చీరాల, బాపట్ల, రేపల్లె డిఎస్పీ మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావులు, సిసిఎస్ డిఎస్పీ జగదీష్ నాయక్, ఏ.ఆర్ డీఎస్పీ విజయసారథి, ట్రైనీ డిఎస్పీ అభిషేక్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## ఒంగోలులో లియో గ్లోబల్ ఓవర్సీస్ సేవలు

**బ్రాంచ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్**



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులో లియో గ్లోబల్ ఓవర్సీస్ సేవలు ప్రారంభమయ్యాయి. ఒంగోలులో నూతనంగా నెలకొల్పిన బ్రాంచ్‌ను ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ పారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఒంగోలు విద్యార్థులకు ఒక గొప్ప అవకాశం లభించింది. ప్రపంచ స్థాయి విద్యను పొందే దిశగా లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ మద్దతుగా నిలుస్తుంది. మన యువతకు సరైన మార్గదర్శకత్వం అవసరం. మంచి విశ్వవిద్యాలయాలు, సరైన కోర్సులు, వీసా ప్రాసెసింగ్, ప్రవాస దేశాల్లో స్థిరపడే విధంగా ఈ సంస్థ అందించే సేవలు ప్రశంసనీయం. ఒంగోలు కేంద్రంగా ఈ సంస్థ సేవలు అందించడంతో, స్థానిక విద్యార్థులు ఇతర నగరాలకు వెళ్లకుండానే ఉత్తమ అవకాశాలను పొందగలరని అన్నారు. ఈ సంస్థ ద్వారా విద్యార్థులు ఉత్తమమైన భవిష్యత్తును సృష్టించుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థకు ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ విజేష్ రాజ్ పాలపర్తికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగడ సుజాత, జిల్లా కమ్మ సంఘం అధ్యక్షులు మండవ మురళీ కృష్ణ, కన్నెటి ప్రసన్న లక్ష్మి (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, లియో గ్లోబల్ ఓవర్సీస్ - ఇండియా), పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రతినిధులు, విద్యావేత్తలు హాజరై లియో గ్లోబల్ ఓవర్సీస్ సేవలను ప్రశంసించారు.

# రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలి

**ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి**

**కంభం, అర్ధవీడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ దామోదర్**

కంభం, మేజర్‌న్యూస్: కంభం సర్కిల్ కార్యాలయం, అర్ధవీడు పోలీస్ స్టేషన్‌లను సందర్శించారు. సందర్శనలో భాగంగా ముందుగా సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డ్ రూమ్, లాకప్ రూమ్, రైటర్ రూమ్, ఎస్సై రూమ్‌లను పరిశీలించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సర్కిల్, పోలీస్ స్టేషన్లో నిర్వహించే రికార్డులు అన్నిటిని పరిశీలించి, పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే ఆ కేసుల పరిష్కారానికి ఏ విధంగా కృషి చేయాలో పలు కీలక సూచనలు చేశారు. అంతేకాక నేరం జరిగాక కంగారు పడడం కంటే, నేరం జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, అందులో భాగంగా సిబ్బంది పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల గ్రామాల్లో రాత్రిపూట గస్తేని ముమ్మరం చేయాలని, గ్రామస్తులతో మమేకమవుతూ సమాచార వ్యవస్థను బలోపేతం



చేసుకోవాలని సూచించారు. తద్వారా ఆ ప్రాంతాల్లో అల్లర్లు, గొడవలు, ఇతర నేరాలు జరిగే అవకాశాన్ని కొంతమేర తగ్గించుకోగలమని తెలిపారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతోగాను ఉపయోగపడతాయన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు, మహిళా పోలీస్ లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి, వారికి హెల్మెట్ విశిష్టతను వివరించి హెల్మెట్ లేని వారికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసి వారిలో చైతన్యం కలిగించటం జరిగినది. ప్రజలకు పోలీస్ వ్యవస్థను మరింత చేరువ చేస్తూ స్నేహ పూర్వక పోలీసింగ్ అందించడం మన బాధ్యత. కనుక దానిని ఎవరూ విస్మరించవద్దని, ప్రజా సమస్యల పరిష్కారంలో మహిళ భద్రత విషయంలో రాజీ పడవద్దని తెలిపారు. మార్కాపురం డిఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కంభం సిఐ మల్లికార్జున రావు, అర్ధవీడు ఎస్సై సుదర్శన్, కంభం ఎస్ఐ నరసింహారావు, బీవీ పేట ఎస్ఐ రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.



## జిల్లా పోలీసు 'మీకోసం'కు 54 ఫిర్యాదులు

ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం'కు 54 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజానీకం వారి ఫిర్యాదుల గురించి పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. పోలీసు అధికారులు ప్రతి ఫిర్యాదుదారునీతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, చీటింగ్, జాబ్ ఫ్రాడ్, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సురేష్ బాబు, ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్ బాబు, సిసిఎస్ సీఐ జగదీష్, ఎస్సీ ఎస్టీ సెల్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# గిరిజన జనభా కులగణన జరిపి ఎస్టీ వర్గీకరణను అమలు చేయాలి

ఒంగోలు, మేజర్‌న్యూస్ : సుప్రీం కోర్టు న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పు మేరకు ఎస్టీలకు కూడా గిరిజన జనాభా కులగణన జరిగి తద్వారా ఎస్టీ వర్గీకరణ వెంటనే ఏర్పాటు చేసి 14 లక్షల మంది యానాదుల జీవితాల్లో వెలుగులు నింపాలని యానాది సంఘాల మహా కూటమి డిమాండ్ చేసింది. తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలని కోరుతూ సోమవారం ప్రకాశం భవనంలో మీకోసంలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాకు నేతలు వినతి పత్రం అందజేశారు. ఏపిలో 35 గిరిజన ఉప తెగలు, 40 లక్షలకుపై చిలుకు జనాభా కలిగి ఉన్నారు. అందులో అత్యధికంగా కడు పేదరికంతో 14 లక్షల మంది యానాదులు మాత్రమే ఉన్నారని ప్రభుత్వ గణంకాలు చెబుతున్నాయి. అత్యధిక శాతం యానాదాలు జనాభా కలిగి ఉన్నప్పటికీ నేటికి తినటానికి తిండి, కట్టుకోవడానికి సరైన బట్టలు, బ్రతకడానికి భూమి కూడా లేదన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్టీ వర్గీకరణ చేసి యానాదుల జనాభా నిష్పత్తి ప్రకారం యానాదులకు ఎస్టీ వర్గీకరణ అమలు జరిగేలా చూసి ప్రభుత్వం నుండి వారికి రావాల్సిన అవకాశాలు కల్పించి, వారి అభివృద్ధికి తోడ్పాటును ఇవ్వాలని కోరుతూ విన్నమించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల వెంకటపతి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పొట్లూరి లక్ష్మయ్య, జిల్లా నాయకులు చలంచర్ల ప్రసాద్, రావూరి శ్రీనివాసరావు, బూదూరి సుబ్బారావు, చేవూరి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## యువతిని హతమార్చిన దోషులను కఠినంగా శిక్షించాలి



చీరాల, మేజర్‌న్యూస్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో 22 ఏళ్ల దళిత యువతిపై అత్యాచారం చేసే అతికిరాతకంగా చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నారు. సందర్భంగా చీరాల తాహసిల్దార్ కార్యాలయం ఎదుట దళిత బహుజన పార్టీ నేతలు ఆందోళన చేపట్టి తహసిల్దార్ గోపికృష్ణకు వినతి పత్రం అందజేశారు. జిలానీ మాట్లాడుతూ దేశంలో దళిత ప్రజలకు రక్షణ కరువైందన్నారు. ఆడపిల్లల పట్ల విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్న మానవ మృగాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లావణ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, షబీర్ పాల్గొన్నారు.

## నూతన వధువును ఆశీర్వదించిన కదిరి బాబురావు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని శిలంవారిపల్లె గ్రామానికి చెంది హైదరాబాద్ ఉప్పుగూడ ప్రాంతంలో నివాసముంటున్న సుంకరి ప్రకాష్, పద్మ దంపతుల కుమార్తె మానస వివాహం సందర్భంగా సోమవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావు పలువురు ప్రముఖులు పెండ్లికుమార్తె మానసను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు వెంట కెబిఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.వి.ప్రకాశరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారధి, కె.పి.నాయుడు, కదిరి కృష్ణ, కొట్టే శ్రీనివాసులు, పలువురు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

## కమ్మ సేవ సంఘం మండల అధ్యక్షులుగా ప్రసాద్



దర్శి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని దర్శి కాకతీయ కమ్మ సేవ సంఘం అధ్యక్షులుగా గుర్రం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమ్మసేవ సంఘము కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది. అధ్యక్షులుగా గుర్రం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గోనుగుంట్ల శ్రీధర్, కార్యదర్శిగా మణికొండ మల్లిఖార్జున రావు, సహాయ కార్యద ర్శిగా కొర్రపాటి హనుమంతరావు, కోశాధికారిగా దామ తిరుపతి స్వాములు ఎన్నికయ్యారు. కమ్మ సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రసాద్ తెలిపారు.

## శివమాలధారణ స్వాములకు భోజనవితరణ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం నందు మాల ధారణ చేసిన పలువురు శివస్వాములకు సి.ఎస్.పురం పట్టణానికి చెందిన తోట తిరపతయ్య(ముఠామేస్త్రి), రత్తమ్మ దంపతులు సోమవారం భోజనవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు ప్రముఖ నాయకులు బిక్షదాతల కుటుంబ సభ్యులను పీఠం శేషవస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాలధారణ స్వాములకు బిక్షవసతి కల్పించడం అభినందనీయమని భిక్షదాతలకు పరమేశ్వరుడు ఆయురారోగ్యాలు అష్టఐశ్వర్యాలు కలిగించాలని కోరుకుంటున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో భోజనదాతలు, పలువురు నాయకులు, మాలధారణస్వాములు, స్థానికులు, పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం అధ్వానం ప్రబలుతున్న వ్యాధులు



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని మద్దిపాడులో పాశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వారానికి ఒకసారి కూడా చెత్తను తరలించే పాపాన పోలేదు. మద్దిపాడు పంచాయతీ అప్గ్రేడ్ అయినప్పటికీ పారిశుధ్యం తరలించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగటం లేదు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరు కోని పోయింది. తీవ్రమైన దోమల బెడద చెత్త కుప్పలు రోజులు వారి నిలవ ఉండటంతో పాటు మురికి కదలకపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. మద్దిపాడు అరుంధతి నగర్‌లో మురుగు తేరు ముందుకు కదలక పోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. కడియాల యానాదయ ప్రభుత్వ కళాశాల గోడ సమీపంలో చెత్తాచెదారం పేరు కొని పోయింది. బీసీ కాలనీ మురుగు కాలువలు ముందుకు కదలడం లేదు. దళితవాడలో మురుగు కాలువలు మురుగు నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు కనీసం దోమలకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. పంచాయతీ 15 ఆర్థిక సంఘం నిధులు కనీసం ఫాగింగ్ చేసేందుకు వినియోగించవచ్చు, కానీ ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోయి ఉంది. గడియపూడి కాలనీలో కనీసం చెత్త బండి కూడా రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దోమలకు రోగాల బారిన పడుతున్నామని కనీసం అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఈ శ్రమ్ లబ్దిదారుల పేర్లు నమోదు చేయాలి



అద్దంకి, మేజర్‌న్యూస్: పురపాలక సంఘం పరిధిలో ఈ శ్రమ్ పథకం కింద పేర్లు నమోదు వేగవంతం చేయాలని కమిషనర్ డి. రవీంద్ర అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా) కార్యాలయం వద్ద ఈ శ్రమ్ దరఖాస్తుకు సంబందించిన బ్రోచర్ ను సోమవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నాలుగు పురపాలక సంఘాల్లో తొమ్మిది లక్షల మందిని సభ్యులుగా చేర్చాలనేది నిర్ణయమన్నారు. ఇందు లో అద్దంకి పురపాలక సంఘంలో కనీసం ఆరు వేలుమంది లబ్దిదారుల పేర్లు నమోదు చేయాలన్నారు. ఎలాంటి ప్రీమియం లేకుండా ఈ శ్రమ్ కార్డు పొందిన వారికి రూ.రెం డు లక్షల ప్రమాదబీమా, లక్ష రూపాయలు స్వల్ప గాయాల బారిన పడిన వారికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. సం ఘాల్లోని సభ్యుల కుటుంబీకుల వివరాలను తక్షణం నమో దు చేయాలన్నారు. ఆధార్ కార్డుతో అనుసంధానం అయిన సెల్ ఫోన్ కలిగి ఉన్నవారి పేరు సులభంగా నమోదు చేయవ చ్చన్నారు. కార్యక్రమంలో సీఎంఎం శ్రీలత, ఆర్పిలు పాల్గొన్నారు.

## ఆటోల్లో దూరప్రయాణం ప్రమాదకరం: ఏ.సుబ్బరాజు



అద్దంకి మేజర్ న్యూస్. కూలీ పేరుతో దూరప్రాంతాలకు సురక్షితమైన వాహనాల్లో ప్రయాణించాలి గానీ ప్రమాదకరమైన ఆటోల్లో ప్రయాణించరాదని సీఐ.ఏ.సుబ్బరాజు అన్నారు. సోమవారం సాయంత్రం భవానీకూడలి, కలవకూరు రోడ్డు మలుపు వద్ద కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోలను గుర్తించి నిలుపుదల చేశారు. గతేడాది జరిగిన రెండు ప్రమాదాల్లో జే పంగులూరు మండలానికి చెందిన కూలీలు దుర్మరణం చెందారన్నారు. ఇలాంటి వాహనాల్లో ప్రయాణించిన సమయంలో ఎవరైన చనిపోతే బీమా కూడా వర్తించే అవకాశం లేదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం శ్రేయస్కరం అన్నారు. దీనికితోడు మితిమీరిన వేగంతో ఆటోలు..ప్రయాణిస్తుంటాయని, కొందరు చోదకులు లైసెన్సులు కూడా ఉండవన్నారు. ఇవన్నీ గమనించకుండా ఆటోల్లో ప్రయాణించి కోరి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్ద న్నారు.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి: డీఎస్పీ



కనిగిరి, మేజర్‌న్యూస్: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని కనిగిరి డిఎస్పీ టి.సాయి ఈశ్వర్ యస్వంత్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెంట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రయాణించే వాహనదారులకు గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే మోటార్ వెహికల్ యాక్ట్ చట్ట ప్రకారం జరిమానాలు విధించడంతోపాటు శిక్షలు పడే విధంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ వాడకుండా వాహనాలు నడిపితే జరిగే అనర్థాలు గురుంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై మాధవరావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్పెషల్ పారిశుద్ధ్య డ్రైవ్ ప్రారంభించిన కమిషనర్



బాపట్ల టౌన్ మేజర్ న్యూస్: బాపట్ల పురపాలక సంఘం పరిధిలో సోమవారం నుంచి ప్రారంభమైన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ను మునిసిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి 18 వ వార్డు ఎంజీ రోడ్డు నందు ప్రారంభించారు. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవుల నందు పట్టణం మొత్తం కూడా పారిశుద్ధ్య మెరుగుపడే విధంగా ఒక ప్రణాళిక రూపొందించి తగననుగుణంగా పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీలలో పూడిక తీత పనులు, దోమల నియంత్రణకు ఫాగ్గింగ్ నిర్వహించడం, రోడ్ల మార్జిన్ల నందు పిచ్చి మొక్కలు తొలగింపు, లార్వా నియంత్రణకు ఆయిల్ బాల్స్ ను ఉంచడం, వార్డుల నందు అంతర్గత రోడ్లను శుభ్రపరచడం తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈ ప్రత్యేక డ్రైవ్ నందు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్. కరుణ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఎన్నికల కోడ్ కారణంగా

## వేలంపాట వాయిదా



బాపట్ల మేజర్ న్యూస్: బాపట్ల పురపాలక సంఘమునకు చెందిన పాత వాహనములు, పాత ఇనుము, పాత టేకు కలప విక్రయించుటకు తేది. 04.02.2025న బహిరంగ వేలము నిర్వహించవలసియుండగా సదరు వేలము కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రు ల ఎమ్.ఎల్.సి. ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున వాయిదా వేయడమైనది ఎన్నికల కోడ్ ముగిసిన తదుపరి బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు తేది, సమయము బహిరంగ వేలము నోటీసు ద్వారా తెలుపుతా మన్నారు. బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ జి రఘునాథరెడ్డి.

## పాఠశాల అభివృద్ధికి రూ.20వేలు ఆర్థిక సాయం



పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిన్న దోర్నాల పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు పసుపుల వెంకటయ్య, మేడబోయిన శివ ఆవులయ్య డీలర్, గుండారెడ్డి వెంగయ్య రూ.20వేలు ప్రధానోపాధ్యాయులు మండ్ల శ్రీనివా సులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుబ్బా రావు, పాలకీటి శ్రీనివాసులు, గాదె కాశీ రావు, వద్దిపాటి శ్రీను, లక్ష్మి నారా యణ, రామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన ఏపీఓగా పల్లెపోగు మోషే బాధ్యతలు

పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: పుల్లల చెరువు మండల ఉపాధిహామీ పథకం నూతన ఏపీవో గా పల్లెపోగు మోషే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాచర్ల మండలంలో విధులు నిర్వహిస్తున్న మోషే సాధారణ బదిలీలలో భాగంగా పుల్లలచెరువుకి వచ్చినట్లు ఆయన తెలిపారు. ముందుగా జాయినింగ్ ఆర్డర్ ను ఎంపీడీవో వసంతరావు నాయక్ ఇచ్చి అనంతరం ఉపాధి హామీ సిబ్బంది తో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీకందరికీ కూడా నేను సుపరిచితుడేనని అన్నారు. విధులలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మనమందరం విధులలో అలసత్వం వహించకుండా చూసుకోవాలన్నారు. మండలంలో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలందరూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కూలీలకు ఏ సమస్య వచ్చినా వెనివెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పని విషయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

